విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 18 నవంబర్ 2024   8 పేజీలు

నడపలేరు... మూయలేరు...

విశాలాంధ్ర- బ్యూరో ఏలూరు: విద్యార్ధులకు ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పన్నులు, నీటి పన్నులు, విద్యుత్ బిల్లులు కట్టాలన్న మీసేవ కేంద్రాలు.. అవసరం ఎంతో ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రజలకు పౌర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్, టిసిఎస్ భాగస్వామ్యంలో మీసేవ కేంద్రాలను చంద్రబాబు హయాంలో ఏర్పాటు చేశారు. దశలవారీగా మీసేవ కేంద్రాలలో టెక్నాలజీ ఆధారిత పౌర సేవలు అందుబాటులోకి వచ్చాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీసేవా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. అప్పటినుంచి ప్రభుత్వ ఆదరణ లేక త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అంతంత మాత్రంగా ఉన్న సర్వీసులతో ఆదాయం లేక ఆపరేటర్లు అవస్థలు పడుతున్నారు. అటు నడపలేక ఇటు మూసి వేయలేక అయోమయంలో ఉన్నారు. 2019లో గ్రామ సచివాలయాలు

- ఆదాయం లేక అవస్థలు...
- త్రిశంకు స్వర్గంలో మీ సేవ....
- సచివాలయ వ్యవస్థ రాకతో మీసేవ అస్తవ్యస్తం...

ఏర్పాటు అయ్యాక మీసేవ కేంద్రాల అవసరం తగ్గిపోయింది. మీసేవ కేంద్రాల నిర్వహకులు హైకోర్టును ఆశ్రయించడంతో వాటిని కొనసాగించాలని ఆదేశించడంతో కొన్నిచోట్ల అవి కొనసాగుతున్నాయి.

సచివాలయ వ్యవస్థ రాకతో మీసేవ అస్తవ్యస్తం...

2014-19 వరకు 350 రకాల సేవల్ని మీసేవా కేంద్రాలలో అందించేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ,వార్డు సచివాలయాల రాకతో అంతకుముందు ఏర్పాటు చేసిన మీసేవా కేంద్రాలు మరుగున పడిపోయాయి. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఎన్ కంబరెన్స్ సర్టిఫికెట్, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, ఆస్తులు, వ్యవసాయ భూముల కొనుగోళ్లలో మ్యుటేషన్ పత్రాలను కూడా మీసేవ కేంద్రాలలో జారీ చేసేవారు. గతంలో రాష్ట్రంలో ఎక్కడి ఆస్తులకు ఎక్కడైనా ఈసీలు పొందే వెసులుబాటు ఉండేది. సచివాలయాల రాకతో అవన్నీ మాయమయ్యాయి. మీ సేవలలో రద్దయిన సేవలను సచివాలయాలలో అందిస్తున్నారా అంటే అది కూడా లేదు. దీంతో ప్రజలు తిరిగి మీసేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు చేయాల్సిన ఉద్యోగాలు విధులపై జాబ్ చార్టును ఖరారు ▶మిగతా 2లో..

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర - ఏలూరు : పట్టణ ప్రాంతాలలో ఇల్లు లేని పేద ప్రజలకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఐ 1వ డివిజన్ నందు ఇళ్ల స్థలాల కేటాయింపులు పెంపుదల అర్జీల నమోదు కార్యక్రమం అడ్డగర్ల లక్ష్మీ ఇందిర ఆధ్వర్యంలో జరిగినది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పేద ప్రజలకు చాలీ చాలని సెంటు భూమి ఇళ్ల స్థలాలకు కేటాయించిందని విమర్శించారు. అప్పటి నుంచి సీపీఐ అనేక సార్లు ఇళ్ల స్థలాలను పెంపుదల చేయాలని కోరుతూ పోరాటాలు నిర్వహించినా గత ప్రభుత్వం స్పందించలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసేలా కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో పేదలకు 2 సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని చెప్పిన హామీని నెరవేర్చేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ▶మిగతా 2లో..

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

విశాలాంధ్ర - ఆలమూరు : సీపీఐ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను 3 సెంట్లుగా మార్చి ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందించాలని, ఇంతవరకు ఇంటి స్థలం లేనివారికి స్థలం కేటాయించాలని అలాగే ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఆర్థిక సహాయం చేయ్యాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆలమూరు మండలం శాఖ బికేఎంయు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఆలమూరు సమత ఆఫీసు వద్ద ఆదివారం దరఖాస్తులు పూర్తిచేయడం జరిగింది. మిగిలిన దరఖాస్తుదారులు 18న అనగా సోమవారం ఉదయం ఆలమూరు సచివాలయంలో దరఖాస్తులు అందజేయడానికి తరలిరావాల్సిందిగా కోరారు. బికేఎంయు జిల్లా కార్యదర్శి కె రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ శ్యామ్, సీపీఐ ఆలమూరు శాఖ కోశాధికారి వరలక్ష్మి, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆనంద్, రాము పాల్గొన్నారు.

సేవలకు చిరునామా కాస్మో : మంత్రి నిమ్మల

విశాలాంధ్ర - పాలకొల్లు : సేవ కార్యక్రమాలకు చిరునామాగా పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఉంటుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం అఖిల భారత స్థాయి ఐష్ట సీనియర్ నేషనల్ ఛాంపియన్ 2024, చెరుకూరి బుద్ధా అవతారం రాజు మెమోరియల్ టోర్నమెంట్ ఆఖరి రోజు కార్యక్రమంలో భాగంగా విజేతలకు బహుమతులను పంపిణీ చేసే కార్యక్రమం కాస్మో ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి నిమ్మల రామా నాయుడు ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఆయన మాట్లాడుతూ ప్రముఖ టెన్నిస్ ప్లేయర్, మానవతావాది చెరుకూరి బుద్ధావతారంరాజు ▶మిగతా 2లో..

నేడు ఆందోళనలు జయప్రదం చేయండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర జంగారెడ్డిగూడెం: పేదలకు ఇళ్ళ స్థలాలు, ఇళ్ల నిర్మాణం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 18న సోమవారం ▶మిగతా 2లో..

సమాజాన్ని చైతన్యపరిచేది కళాకారులు

జానపద కళాకారుల రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఆర్ కృష్ణబాబు

విశాలాంధ్ర - కామవరపుకోట : సమాజాన్ని చైతన్యపరిచే వారు కళాకారులని జానపద కళాకారుల ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఆర్ కృష్ణబాబు అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల సమావేశంలో నేటి సమాజంలో కళాకారుల పాత్ర అనే అంశంపై ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ బాబు మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు కళాకారులు వివిధ రూపాల ద్వారా ప్రజలను పలు అంశాలపై చైతన్య పరుస్తున్నారన్నారు. చారిత్రక, విప్లవాత్మక విశేషాలను ఎప్పటికప్పుడు ప్రజలకు కంటికి కట్టినట్టులా అలరించే విధంగా కళాకారులు పాటు పడుతున్నారన్నారు. అంతరించిపోతున్న ▶మిగతా 2లో..

మూయలేరు... (1వ పేజీ తరువాయి)

చేయకపోవడమే ఈ రకమైన సమస్యకు కారణం అవుతోంది.

అర్జీదారులకు చుక్కలు....

సచివాలయాలలో జారీ చేసే ధ్రువీకరణ పత్రాల విషయంలో మరో సాంకేతిక సమస్య ఎదురవుతోంది. మీసేవ కేంద్రాలలో నిర్ణీతరుసుం చెల్లిస్తే ఎన్ని కాపీలైనా ప్రింట్ చేసే అవకాశం ఉంటుంది. సచివాలయాలలో ప్రస్తుతం డిజిటల్ కాపీలను మాత్రమే జారీ చేస్తున్నారు. కుల,ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లాంటి వాటికి ఒక కాపీ మాత్రమే మంజూరు చేస్తున్నారు. సచివాలయాలలో జారీ చేసే డిజిటల్ కాపీలను మీసేవ కేంద్రాలలో ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారు. పిడిఎఫ్ కాపీలకు ఎవరైనా నకిలీ పత్రాలను సృష్టిస్తే తాము చిక్కులలో పడతామని, సచివాలయాలు జారీ చేసే పత్రాలను ముద్రించడానికి మీసేవ కేంద్రాలు నిరాకరిస్తున్నాయి.

అన్నివేళలా అందుబాటులో సేవలు....

మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉండేవి.ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో మీసేవ కేంద్రాలు నిర్విరామంగా పనిచేస్తూ ఉండేవి. దీంతో వివిధ రకాల ధ్రువపత్రాలు, పన్నులు,వివిధ రకాల బిల్లుల చెల్లింపులకు ఈ కేంద్రాలు ప్రజలకు సౌకర్యంగా ఉండేవి.సచివాలయాలు ఏర్పడిన తరువాత మీసేవ కేంద్రాల పరిస్థితి దయనీయంగా మారింది.

పౌర సేవల్లో అంతులేని నిర్లక్ష్యం....

సుపరిపాలన నినాదంతో సచివాలయ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసినా పౌర సేవలలో అంతులేని నిర్లక్ష్యం ఉంది. సచివాలయాల సిబ్బందిలో జవాబుదారీతనం తీసుకురాకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి. దశలవారీగా 500కు పైగా పౌర సేవలను సచివాలయాలలో అందిస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం అమలులో చతికిలబడింది. రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, విద్యుత్,పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్యం వంటి సేవల్ని అందిస్తామన్నా ఆయా శాఖల నుంచి అధికారాలను మాత్రం సచివాలయాలకు బదలాయించలేదు. సాంకేతికంగా చెప్పాలంటే సచివాలయ సిబ్బందికి ఎలాంటి అధికారాలు లేవు. కేవలం దరఖాస్తుల్ని ప్రాసెస్ చేయడానికి మాత్రమే వారు పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వంలో ఇంటింటికి పెన్షన్ల పంపిణీకే సిబ్బంది పరిమితమయ్యారన్న వాదన ఉంది. యువగళం పాదయాత్రలో లోకేష్ గత ఎన్నికలకు ముందు ఆపరేటర్లు కలిసి విజ్ఞప్తి చేస్తే ఆ సందర్భంగా మీ సేవలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిస్థితులలో మీ సేవలపై పట్టున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మీ సేవలకు పూర్వ వైభవం తెస్తారని భావిస్తున్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి (1వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వంలో పట్టాలు పొందిన లబ్ధిదారుల నుండి అర్జీలను సేకరించి ఈనెల 18న గ్రామ వార్డు సచివాల యాల వద్ద ధర్నా నిర్వహించి అర్జీలను ప్రభుత్వానికి ఇచ్చే కార్యక్రమం ఏలూరు నగరంలో నిర్వహిస్తున్నామని ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ళ వర ప్రసాద్,సమితి సభ్యులు ఉప్పులూరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-టి.నరసాపురం: నేడు గ్రామ సచివాలయాల వద్ద జరిగే ఆందోళన జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు)ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచె వసంత రావు పిలుపునిచ్చారు. టి నరసాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు)ల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల వద్ద ఇళ్ళ పట్టాల కోసం వ్యక్తిగత అర్జీలు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షలు మంజూరు చేసి రోడ్లు,విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజీ పారుదల వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్ళ స్థలాలు లేని వారు తమ వ్యక్తిగత అర్జీలతో ఆందోళనలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టి నరసాపురం మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి తాడిగడప జయరాజు, పులి సత్యం,బుర్ర రమణయ్య, బయ్యగాని వెంకటేశ్వరరావు, గుర్రాల లక్ష్మీ, సరమ్మ,ఓబేలు తదితరులు పాల్గొన్నారు.

హంసినీకి కలెక్టర్ అభినందన

విశాలాంధ్ర -భీమవరం: 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ లో నాలుగు బంగారు పతకాలు సాధించిన సూర్య హంసినీకి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందనలు తెలిపారు. గుజరాత్ లో ఈ నెల 10 నుంచి 12 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్స్ గేమ్స్‌లో నాలుగు బంగారు పతకాలను సాధించిన మాదాల సూర్య హంసినీ ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నాగరాణిని కలుసుకొని కలిశారు. కలెక్టర్ మాదాల సూర్య హంసినీ ని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించి పశ్చిమగోదావరి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. భారతీయ విద్యాభవన్‌లో 11వ తరగతి చదువుతున్న మాదాల సూర్యహంసినీ ఉమన్ నేషనల్ ర్యాంకింగ్ విలువిద్య అండర్-17 సబ్ జూనియర్స్ కేటగిరీలో వ్యక్తిగత కేటగిరీలో 1వ రౌండ్లో బంగారు పతకం, రెండో రౌండ్లో బంగారు పతకం, టీమ్ తరపున ఒక బంగారు పతకం, ఓవరాల్‌గా బారీ స్కోర్ చేసి ఒక బంగారు పతకాన్ని గెలుచుకుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎక్కువ గోల్డ్ మెడల్స్ సాధించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ట్రోఫిని పొందడం జరిగింది. జిల్లా కలెక్టర్‌ను కలిసిన సందర్భంలో సూర్య హంసినీ తల్లిదండ్రులు ఎం.రాజగోపాల్ చౌదరి, ఎం.ప్రవళిక, భారతీయ విద్యా భవన్ చైర్మన్ యు.కె. విశ్వనాథరాజు, సెక్రటరీ, కరస్పాండెంట్ సామంతపూడి శ్రీరామరాజు, ఎక్స్ అఫీషియో సభ్యులు కె.వెంకట శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ డీ.జె దేవి పద్మ, ఆర్చరీ కోచ్ కమల్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో పోలవరం, చింతలపూడి పూర్తిచేస్తాం : ఎంపీ

విశాలాంధ్ర నూజివీడు: ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్ట్, ఉమ్మడి ఉభయగోదావరి,కృష్ణా జిల్లాల వరదాయిని చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని రానున్న ఐదేళ్లలో తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. నూజివీడు సమీపంలోని మామిడి తోటలో ఆదివారం జరిగిన కమ్మవారి వన సమారాధన కార్యక్రమానికి ఎంపీ మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేయటం కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం గడువులోపు పూర్తి చేయడం జరుగుతుందని ఎంపీ మహేష్ కుమార్ పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయగా, డిసెంబర్ నుంచి పనులు ప్రారంభించే అవకాశం ఉందని ఎంపీ తెలిపారు. ప్రాంతంలో అత్యధికంగా మామిడి సాగు చేస్తున్న నేపథ్యంలో త్వరలో రైతులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుంటానని ఎంపీ తెలిపారు.ఇప్పటికే పామ్ ఆయిల్,ఆక్వా, పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానని, మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి దృష్టి సారించినట్లు ఎంపీ స్పష్టం చేశారు. నూజివీడు నియోజకవర్గ ప్రాంతంలో మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించడంతోపాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ వెల్లడించారు. తాను ఎంపీగా విజయం సాధించిన నాటి నుంచి ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. అంతకు ముందు దివంగత రామ్మూర్తి నాయుడు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, తెదేపా నాయకులు కాపా శ్రీనివాసరావు, అక్కినేని చందు, ఆళ్ల వెంకట గోపాలకృష్ణ, నందిగం సీతారామ తిలక్, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులు (1వ పేజీ తరువాయి)

జానపద, పౌరాణిక, బుర్రకథ , కంజరి కథ, హరికథ వంటి కళలను నేటి తరానికి పరిచయం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో కవులు కళాకారులు కలిసి ప్రజలలో పాతుకుపోయిన అనేక రుగ్మతలను తొలగించాల్సిన పరిస్థితి ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు షేక్ ఇబ్రహీం, వీరమల్ల మధు సాగర్, కృష్ణ బాబు, వీరమల్ల సత్యనారాయణ లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు ఎం భీమరాజు, వీరమల్ల మధు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి (1వ పేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల్లో పేదలతో వ్యక్తిగత అర్జీలు అందించి, ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, ఈ ఆందోళన కార్యక్రమాలకు పేదలు, కష్టజీవులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. ఆదివారం జంగారెడ్డి గూడెం మండలం పేరంపేట గ్రామంలో ఆందోళన కార్యక్రమాలు గురించి విస్తృత ప్రచారం నిర్వహించి పేదలకు దరఖాస్తులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న జిల్లాలోని అన్ని సచివాలయాల వద్ద సీపీఐ,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేద ప్రజలందరికి పట్టణంలో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ళ స్థలం ఇవ్వాలని, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పేరంపేట గ్రామంలో ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వలేదన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. ప్రభుత్వ భూములను కొందరు భూకబ్జాదారులు ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. భూకబ్జా వ్యవహారాలన్నీ స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిసి నప్పటికీ తెలియనట్లు నటిస్తున్నారని, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను అధికారులు వెంటనే స్వాధీనం చేసుకుని పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా జంగారెడ్డిగూడెం మండలంలో ఎర్రకాలువ జలాశయం నిర్మాణానికి సేకరించిన భూముల్లో మిగులు భూములను ప్రతీ కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికి జిల్లాలో అనేక గ్రామాల్లో,పట్టణాలలో ఇల్లు,ఇల్లు స్థలాలు లేని పేదలు కోకొల్లలుగా ఉన్నారన్నారు. జిల్లాలో నిరుపేదలు అనేకమంది కూలి నాలి చేసుకుంటూ అద్దె ఇళ్ళలో నివాసం ఉంటున్నారని,ఇల్లు,ఇంటి స్థలాలు లేని ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఇచ్చి,ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా నిత్యావసరాల వస్తువుల ధరలు విపరీతంగా పెరగటం, పెట్రోల్, డీజిల్ ,వంటగ్యాస్ , ధరలతో సామాన్య ప్రజలు జీవనానికి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఎన్నికల హామీలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు,వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు గొలిమే బాలయేసు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు మన్నవ యామిని,వరకా శ్యామల,కలపాల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు .

చిరునామా కాస్మో (1వ పేజీ తరువాయి)

స్మారకంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఇందుకు కారణమైన కాస్మో చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజును ప్రత్యేకంగా అభినందించారు. గత సంక్రాంతి సంబరాలలో బుద్ధావతారం రాజుపై వున్న అభిమానంతో పెద్ద ఎత్తున సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరిగిందన్నారు. క్రీడల్లో పాల్గొన్న వారు వృద్ధాప్యం అయిన ఆరోగ్యంగా ఉంటారని, ఈ రోజుల్లో ఎంత ఆస్తి ఉన్నా ఆరోగ్యం ప్రధానమైనదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి నిమ్మల రామానాయుడు, ఎపిఐఐడిసి చైర్మన్ మంతెన రామరాజులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం చేసే కార్యక్రమం జరిగింది. 550, 650, 700,750 పోటీల్లో సింగిల్స్, డబుల్స్ విజేతలకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఎపిఐఐడిసి చైర్మన్ మంతెన రామరాజు, గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు (బూన్ రాజు) రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర - ముదినేపల్లి : కిషోరబాలికలు ఆహారం , ఆరోగ్యం , బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాలు ముదినేపల్లి మండలం అల్లూరు అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సిహెచ్ ప్రసూన , కోడూరు , వైవాక గ్రామాల్లో సూపర్వైజర్ ఝాన్సీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలకు 18 ఏండ్లు , బాలురకు 21 సంవత్సరాలు వచ్చేవరకు వివాహాలు చేయకూడదని చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయన్నారు. బాల్యవివాహాలు చేస్తే నెలలు నిండని శిశువుకు జన్మనిస్తారని , రక్తహీనతకు గురై పలు ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏ డబ్ల్యు డబ్ల్యు సిహెచ్ భాగ్యలక్ష్మి , టి మంగమ్మ , సిహెచ్ నాంచారమ్మ , హెచ్ఎం ఎస్ రామోజీ , ఏఎన్ఎం కృపసంతోషిబాయి , ఆశాలు పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్ప భాష : రవిచంద్రన్

విశాలాంధ్ర - లింగపాలెం : తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని, మధురమైన మాతృభాష తెలుగు భాషని తెలుగు పండిట్ రవిచంద్రన్ తెలిపారు. ధర్మాజీగూడెంలోని గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈయన విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయ అధికారి వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల వన సమారాధన

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు భద్రకాళి అమ్మవారి మందిరం ఆవరణలో ఆదివారం చేనేత కార్మికుల కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. తొలుత ఉసిరి చెట్టుకు రాష్ట్ర ఆప్కో మాజీ డైరెక్టర్ దొంతంశెట్టి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. చేనేత కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తీడ కృష్ణమోహన్, వాసపల్లి సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఉండి : అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ 18న మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ సచివాలయాలు వద్ద సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ ఉండి ఏరియా సమితి కార్యదర్శి కలి శెట్టి వెంకట్రావు పిలుపునిచ్చారు. ఉండి మండలంలో పలు గ్రామాల్లో అర్హులైన పేదలను గుర్తించి ఇళ్ల స్థలాల దరఖాస్తులు ఆదివారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు లేని అర్హులైన పేదలు వందల సంఖ్యలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గూడు, నీడ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు సీపీఐ పార్టీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనను, ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా : ఎంపీ

విశాలాంధ్ర, ముదినేపల్లి : టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా రూ.5 లక్షలు, మట్టి ఖర్చులు రూ. 10 వేలు, పార్టీ కార్యకర్తలకు విద్య, వైద్యంలో సహకారం ఉంటుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. ముదినేపల్లి మండలం పెదపాలపర్రులో పార్టీ మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి ఇంటి వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సమీక్షించారు. పార్టీ కేడర్కు ఎలాంటి సమస్యలున్నా ఏలూరులో తన కార్యాలయంలో కలుసుకోవచ్చన్నారు. కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి సభ్యత్వాలు ఎక్కువమంది చేరేలా చూడాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎప్పుడు తాను అందుబాటులో ఉంటానన్నారు.ఈ కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగళ్ళ రాము , మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కొత్త నాగేంద్రబాబు కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహరావు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ , అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు , నాయకులు కోడూరు శేషబాబు, చలసాని జగన్మోహనరావు,దావు నాగరాజు, బొంగు రవికుమార్ ,ఈపుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ నెరవేర్చాలి : సీపీఐ

విశాలాంధ్ర - కామవరపుకోట : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తూరు బత్రాజుల కాలనీలో అభ్యుదయ బత్రాజుల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద ఇల్లులేని నిరుపేదలను సమీకరించి ఇంటి స్థలం దరఖాస్తులను పూర్తిచేసి అందించారు. ఈ సందర్భంగా టీవీఎస్ రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇల్లు లేని పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, ఇంటి నిర్మాణానికి రూ.5 ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాలకు దరఖాస్తు దారులందరూ రావాలని, సోమవారం సచివాలయం ముందు ధర్నా నిర్వహించి సచివాలయ కార్యదర్శి దరఖాస్తులు అందించున్నారు. ఇంటి స్థలం ఇవ్వటంతో పాటు ఇనుము, ఇసుక,ఇటుక, సిమెంటు తదితర ఇంటి నిర్మాణ అవసర మైన మెటీరియల్ లబ్ధిదారులకు ప్రభుత్వమే అందచేయాలని కోరారు.

కవి పండితుల సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర - భీమడోలు : సమాజ హితాన్ని కోరే సాహిత్యాన్ని సృజించే కవి పండితుల సేవలు అమోఘమని పలువురి వక్తలు కొనియాడారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నాలుగో రోజైన ఆదివారం పండిత చర్చాగోష్ఠి, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కవి పండిత గోష్ఠి సభకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. కవి పండితులు, విద్యావేత్త, తెలుగు పండితులు, దెందులూరు తెలుగు అధ్యాపకులు జటావల్లభుల సాయిరాం, రిటైర్డ్ తెలుగు పండితులు, చందూరి సీతారామ సూర్య ప్రకాష్ లు పాల్గొని కవిత్వ మాధుర్యాన్ని చక్కగా వివరించారు. సాయిరాం మాట్లాడుతూ అల్లసాని పెద్దన్న, వివిధ కవుల పద్యాలను అలవోకగా వినిపించారు.సూర్యప్రకాష్ మాట్లాడుతూ పోతన కవితా వైభవాన్ని ప్రస్తావిస్తూ, పద్యంపఠన చేసిన తీరు ఆకట్టుకుంది.అనంతరం సెల్ ఫోన్స్ వద్దు, గ్రంథాలయమే ముద్దు అనే అంశంపై వ్యాస రచన పోటీలు జరిగాయి.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితమే సాహిత్యం

విశాలాంధ్ర-భీమవరం: సమాజ హితమే సాహిత్యమని నిరంతర మేథోమథనం ద్వారానే కవులు, రచయితలు సాహిత్యాన్ని సృజించగలరని, అలాంటి సాహిత్యం నిరంతర సమాజహితాన్ని కోరుతుందని సాహితీవేత్త అక్షరకిరీటి తెన్నేటి మాస్టారు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా తెన్నేటి మాస్టారి సంచాలకత్వంలో ఆదివారం ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. తెన్నేటి మాస్టారు మాట్లాడుతూ కవులు, రచయితలు నిరంతరం సమాజాన్ని పరిశీలించి, సమస్యలను గుర్తెరిగి తన దైన శైలిలో పరిష్కారాలను తమ రచనల ద్వారా సమాజానికి అందివ్వాలన్నారు. ఎంతో గొప్ప చరిత్రకు మనం వారసులం మన ఆంధ్రజాతి అనాది సాంస్కృతిక వారసత్వాలకు పెన్నిధి అంటూ కలిగొట్ల గోపాల శర్మ ఆలపించిన ఆంధ్రుల వైభవం సభికులను అకట్టుకుంది. మంచి పుస్తకం మంచి మిత్రునితో సమానం పుస్తకం మనలని మంచి దారిలో నడిపించే నేస్తం అంటూ అప్పన్న మాస్టారు చదివిన మంచి పుస్తకం కవిత, కాలంతో పాటే మనం మారాలి కాలానుగుణంగా వచ్చే మార్పులకు అలవాటు పడినప్పుడే జీవితం అందంగా సాగుతుందంటూ చివటం శ్రీనివాసరావు మాస్టారు చదివిన కవిత సభికులను ఆలోచింపచేసినవి. అదే విధంగా డాక్టర్ పెంకి విజయకుమార్, దొంతాభక్తుని రామనాగేశ్వ రరావు, చిర్రావూరి లక్ష్మీ నారాయణ, పులిదిండి సత్యం, కొత్తపల్లి మణిత్రినాథరాజు, యల్. వెంకటేశ్వర్లు తదితరులు చదివిన కవితలు సభికులను ఆలోచింపచేసే శాయి. కవి సమ్మేళనంలో సాహితీవేత్త అక్షరకిరీటి తెన్నేటి మాస్టారు వ్రాసిన స్వీయ కథా సంపుటి తెన్నేటి కతలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ మల్లుల శ్రీనివాస్, మానవత స్వచ్ఛంద సంస్థకు చెందిన బుద్ధరాజు వెంకటపతిరాజు, పెనుమత్స రామోహన వర్మ, ,కారుమూరి నరసింహ మూర్తి, గ్రంథాలయ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

విశాలాంధ్ర - పాలకోడేరు : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పాలకోడేరు మండలం గొల్లలకోడేరు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జి.బాలరాజు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గొల్లలకోడేరు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ బి. ఎమ్.కమల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయలతో సమానమన్నారు. అంతే కాకుండా విజ్ఞాన సంపద, నైపుణ్యత గ్రంథాలయాల ద్వారా పొందవచ్చు అన్నారు. అనంతరం విద్యార్థులకు " పర్యావరణం- పరిరక్షణ" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి ఇంటి స్థలం మంజూరు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర -ద్వారకాతిరుమల: ఇల్లు లేని ప్రతి పేదవానికి గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు ఇంటి స్థలం పంపిణీ చేసి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గోలిమే బాల యేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సిహెచ్ పోతేపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ సమావేశం సీపీఐ మండల సహాయ కార్యదర్శి మాండ్రు బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న బాల యేసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం లేని ప్రతి పేదవాడికి ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నేడు గ్రామ సచివాలయాలవద్ద లబ్ధిదారులకు దరఖాస్తులను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిహెచ్ పోతేపల్లి గ్రామ సిపిఐ కార్యదర్శి గంజి పెద్దిరాజు, ముద్దులగూడెం గ్రామ సిపిఐ కార్యదర్శి మంగ మూరి జ్ఞానేషు, కోడిగూడెం సిపిఐ నాయకులు డొక్కా నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి ప్రసాద్,పెట్టా ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఉపాధ్యాయుడు కొత్తూరు వెంకటసుబ్బయ్య అన్నారు. ముదినేపల్లి గ్రేడ్-3 శాఖగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 6,7 తరగతుల విద్యార్థులకు మాతృ భాష ప్రాముఖ్యత , 9,10 తరగతిల వారికి సాంకేతికత వలన వరమా? శాపమా? అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీఉన్నత పాఠశాల , ఇండోసాక్సన్ , గౌతమ్ , సహాయమాత పాఠశాల విద్యార్థిని , విద్యార్థులు , గ్రంథాలయ అధికారిని ఎం శ్రీదేవి , సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : అన్నివర్గాల ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం తనను కలిసిన వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని, పరిష్కారించాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు రావచ్చునని భరోసా కల్పించారు. అలాగే పలువురు ఎమ్మెల్యే చంటిని మర్యాద పూర్వకంగా కలుసుకుని, ఘనంగా సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు మామిళ్ళపల్లి పార్థసారథి, బెల్లపుకొండ కిషోర్, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తి మృతికి సంతాపం

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతిపట్ల ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఎన్నో సేవలందించిన రామ్మూర్తి నాయుడు అన్న అడుగు జాడల్లో నడుస్తూ, పార్టీ అభివృద్ధికి కూడా తనవంతు సహకారం అందించారని కొనియాడారు. ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు సంతాప సభ నిర్వహించి ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడ్ని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, రెడ్డి నాగరాజు, లంక వెంకట రాజశేఖర్, బొద్దాని శ్రీనివాస్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలం ఇవ్వాలి : బండి

విశాలాంధ్ర - ఏలూరు : ఇంటి స్థలం లేని పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు స్థలము గృహ నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సహాయం రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని లబ్ధిదారుల చే అర్జీలు ఈనెల 18న గ్రామ సచివాలయాలలో గ్రామ కార్యదర్శులకు సమర్పించడం జరుగుతుందని బి.కె.ఎం.యు.జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వర రావు తెలిపారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో గీత కాలనీ గట్టుమీద, చంద్రబాబు నాయుడు కాలనీ,యాదవ నగర్ లో ఇళ్ల స్థలాలు లేని పేదలచే అర్జీలు రాయించడం జరిగింది. అలాగే గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు గ్రామాల్లో సెంటున్నర పట్టణాలలో ఒక సెంటుకు బదులు గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు స్థలం ఇవ్వాలని కోరుతూ అర్జీలు పెట్టించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షలు ఇస్తామని చెప్పడం జరిగిందని కానీ, నాలుగు లక్షలతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదని కనీస రూ.5 లక్షలు ఇవ్వాలని, ఇసుక,ఇటుక ఐరన్,సిమెంట్, కంకర వగైరా ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అర్జీలు వ్రాయించే కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు రూరల్ మండల కార్యదర్శి పొట్టేలు పెంటయ్య,జిల్లా సమితి సభ్యులు బుగ్గల ప్రభాకర్, అరిగెల యోహాన్,కే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యధేచ్ఛగా ఇసుక తోలకాలు

విశాలాంధ్ర - సీతానగరం: ఏ విధమైన అనుమతులు లేకుండా యధేచ్ఛగా ఇసుక తోలకాలు జరుగుతున్నాయని సొసైటీ సంఘం సభ్యులు ఆరోపించారు. ఆదివారం ముగ్గళ్ళ గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే ముగ్గళ్ళ ఇసుక ర్యాంపు నుంచి సొసైటీ భూమిలో ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా రవాణా యధేచ్ఛగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానాన్ని తుంగలోకి తొక్కుతూ ముగ్గళ్ళ గ్రామంలో ట్రాక్టర్ యజమానులు తమ ఇష్టానుసారం పేదల సొసైటీ భూములలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని రెవెన్యూ అధికారులు దీనిపై చర్యలు చేపట్టి తోలకాలు జరిపిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని సొసైటి సభ్యులు కోరారు.

మోటార్ సైకిల్ దొంగలు అరెస్టు

విశాలాంధ్ర - కలిదిండి: ఇద్దరు మోటార్ సైకిల్ దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్సై వి. వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోటార్ సైకిల్ దొంగతనాలపై దృష్టి పెట్టి రహస్య సమాచారం సేకరించి గత కొన్ని రోజుల క్రితం 8 మోటార్ సైకిల్ రికవరీ చేసినట్లు తెలిపారు. పాత ముద్దాయిల వద్ద నుంచి అంతర్రాష్ట్ర దొంగల సమాచారం సేకరించి వారి వద్ద నుంచి రూ 1.80 లక్షలు విలువగల రెండు మోటార్ సైకిళ్లను స్వాధీన పరుచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన ఏలూరు సిసిఎస్ సీఐ రాజశేఖర్, కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, కలిదిండి SI వెంకటేశ్వరరావు లను ఏలూరు జిల్లా ఎస్పీ కె.పిఎస్.కిషోర్ అభినందనలు తెలియ జేశారు.

ధర్నా జయప్రదం చేయండి: సీపీఐ

విశాలాంధ్ర -భీమవరం: ఇళ్ల స్థలాలపై కూటమి సర్కారు మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ సచివాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే ధర్నా, ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలపై పేదలకు న్యాయం చేయాలని ఈ నెల 18న సచివాలయాల వద్ద నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని జగనన్న నివేశనా స్థలాల లబ్ధిదారులకు కరపత్రాలు, వ్యక్తిగత దరఖాస్తులు పంపిణీ కార్యక్రమాన్ని పట్టణ సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష్మేశ్వరం, విస్సాకోడేరు వంతెన, బందరుపుంత, భగత్ సింగ్‌నగర్, నెహ్రూ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి సర్కారు అమలు జరపాలని, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏలేటి ఆనంద్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, భూలక్ష్మి, సావిత్రి, మంగమ్మ, దుర్గా భవాని, నూకాలమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు కవితల పోటీలు

విశాలాంధ్ర - కలిదిండి: విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు కవితల పోటీలు దోహదపడతాయని సాహితీ మిత్రులు పోలిశెట్టి. నరసింహారావు, ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయం నందు 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనంలో భాగంగా విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తాము రాసిన కవితలు వినిపించారు. సాహితీ మిత్రులు న్యాయ నిర్ణేతలగా వ్యవహరించారు. కవితల పోటీల్లో ప్రథమ బహుమతి టీ .హనీ, జిల్లా పరిషత్ హై స్కూల్ కలిదిండి, ద్వితీయ బహుమతి జె.లిఖిత, శశిస్కూల్ తృతీయ బహుమతి ఎల్.మాన్విత సాయి జిల్లా పరిషత్ హై స్కూల్ కలిదిండి. విజేతలుగా ప్రకటించారు. గెలుపొందిన వారికి వారోత్సవాల ముగింపు సభలో బహుమతులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి జె. రమేష్ బాబు సిబ్బంది పురుషోత్తం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర తాడేపల్లిగూడెం: గ్రంథాలయ వారోత్సవాలలో ఆదివారం దేశ భక్తి గీతాలు పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ కేటగిరి లలో విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహిం చారు. గ్రంథాలయాధికారి వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. న్యాయ నిర్ణేతలుగా ప్రత్తి వీరస్వామి, కె. వి సత్య ప్రకాష్, వి జాన్ బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా కొరగింజల హరి కిరణ్

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన కొరగింజల హరికిరణ్ ఆదివారం బాధ్యతలు స్వీకరిం చారు. ఆదివారం పాలకొల్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో హరికిరణ్ మాట్లాడుతూ పాలకొల్లులో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గ, మండల, పట్టణ, కమిటీలన్నింటినిరద్దు చేయడం జరి గిందని హరికిరణ్ ప్రకటించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు హరి కిరణ్‌ను శాలువా, పూలమాలలతో అభినందించారు. వర్దనపు కాసు, మహ్మద్ జానీ, రొక్కాల బెన్నీపాల్, గోడి మోహనరావు, బొలిశెట్టి భాను ప్రకాష్, గోగుల మండ భాస్కరరావు పాల్గొన్నారు.

విజయవాడలో కేఆర్ఎంబీ ఏర్పాటు చేయించాలని ఎంపీకి వినతి

విశాలాంధ్ర -నూజివీడు : రాష్ట్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో గత విధ్వంసక వైసీపీ ప్రభుత్వంలో చట్ట విరుద్ధంగా విశాఖపట్నంలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబి) ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని పునఃసమీక్షించి కేఆర్ఎంబి కార్యాలయాన్ని గత కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను అమలుచేసి అన్ని సానుకూలతలు ఉన్న విజయవాడ పట్టణంలోనే ఏర్పాటు చేయాలని ఆదివారం నూజివీడులో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఏలూరు పార్లమెంటు సభ్యులు, కేంద్ర జలశక్తి పార్లమెంటరీ కమిటీ సభ్యులు పుట్టా మహేష్ కుమార్‌కు రాష్ట్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు నేతృత్వంలో ఏలూరు జిల్లా ముసునూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మల లక్ష్మణరావు, నూజివీడు నియోజకవర్గ రైతు నాయకులు కాపా శ్రీనివాసరావు, అక్కినేని చందు, చెరుకూరి దుర్గాప్రసాద్ తదితరులు వినతిపత్రం అందించారు. అనంతరం ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాల మేరకు విజయవాడలోనే కేఆర్ఎంబి కార్యాలయం ఏర్పాటు చేయటానికి ఇబ్రహీంపట్నంలో భవనాలను చూడటం జరిగిందని, 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2020 జూన్, ఆగస్టులలో కేఆర్ఎంబి కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు వ్రాసిందని దీనికి విరుద్ధంగా 2020 డిసెంబరులో కేఆర్ఎంబి కార్యాలయాన్ని కృష్ణా బేసిన్ దాటి విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం అనుహ్య నిర్ణయం తీసుకోవటం చాలా దారుణమన్నారు. విజయవాడలోనే కే.ఆర్.ఎం.బి కార్యాలయాన్ని ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవాలని పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. అట్లాగే ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ మూడవ జోన్ లోని 2.10లక్షల ఎకరాల్లో ఇప్పటికే రైతులు సాగుచేసిన ఆరుతడి పంటలకు డిసెంబర్ 1వ తేదీ నుంచి సాగునీటిని విడుదల చేయటానికి చర్యలు తీసుకోవాలని ఏలూరు పార్లమెంట్ సభ్యుని దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు.దీనిపై ఎం.పి పుట్టా మహేష్ కమార్ స్పందిస్తూ నీటి సంఘాల ప్రతినిధులు, రైతు ప్రతినిధులు కోరిన విధంగా కేఆర్ఎంబి కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోనే ఏర్పాటు చేయటానికి పార్లమెంటు దృష్టికి, కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ దృష్టికి తీసుకువెళ్ళి ఆంధ్రప్రదేశ్ రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి, కృష్ణాజిల్లా పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ గుండపనేని శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా మైలవరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ బొర్రా అశోక్ కుమార్, ఏలూరు జిల్లా ముసునూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకలో 'సత్తి' దంపతులు

విశాలాంధ్ర - అనపర్తి : జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి శ్రీ దేవి దంపతుల కుమారుడు దుర్గాప్రసాద్ రెడ్డి భవ్య శ్రీ నిశ్చితార్థ వేడుకకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం హాజర య్యారు. రాయవరం కళ్యాణ మండపంలో జరిగిన నిశ్చితార్థ వేడుకలో దుర్గా ప్రసాద్ రెడ్డి భవ్యశ్రీకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమం లో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి త్రినాథ్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు సత్తి శ్రీని వాసరెడ్డి, సత్తి వెంకట రెడ్డి (విశాలాంధ్ర),పడాల కమల రెడ్డి పాల్గొన్నారు.

మానవతా సభ్యుల సాయం

విశాలాంధ్ర - గోపాల పురం : ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న సామెతకు భాష్యం ఇచ్చారు వాదాల కుం టకు చెందిన మాన వతా సభ్యులు. ఆదివారం మండలంలోని వాదాల కుంట గ్రామానికి చెందిన ప్రతిపాటి సత్యవతి గొంతు సంబంధిత థైరాయిడ్‌తో దీర్ఘకాలికంగా బాధపడు తుంది. మల్లిపూడి దుర్గారావు దీర్ఘకాలిక వ్యాధితో ఆహారం తీసుకోలేని స్థితిలో గత కొంతకాలంగా బాధపడుతున్నారు. వీళ్ళిద్దరి ఆరోగ్య పరిస్థితిలను తెలుసు కున్న మండల మానవతా చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, వడ్లమూడి రమేష్, గెడ జోగేంద్ర ప్రసాద్, శ్రీరామ్ తమకు కలిగిన దాని నుండి ఒక్కొక్కరికి 5500 చొప్పున ఆర్థిక చేయూతను అందించారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ రాంబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదు కోవడమే మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రధాన ధ్యేయమని తెలిపారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మానవతా నాయకులు వడ్లమూడి రమేష్ మాట్ల డుతూ రోగులకు తమ వంతు సహాయం అందించడం కనిపించని భగవం తునికి సహాయం చేసినట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా సభ్యు లు, సి ఆర్ పి బాధిత ఇరు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: విద్యార్థులు రాజ్యాంగంపై అవగా హన పెంపొందించుకోవాలని దేవరపల్లి శాఖ గ్రంథాలయ ఇన్ చార్జ్ అధికారి అనిత సూచించారు . దేవరపల్లి శాఖ గ్రంథాలయంలో 57 గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం గ్రంథాల యంలో రాజ్యాంగంపై అవగాహన వివిధ అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో దేవరపల్లి చెందిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు, అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యా ర్థులు, దేవరపల్లి హర్షవర్ధన స్కూల్ విద్యార్థులు పాల్గొ న్నారు. వారోత్సవాలు ముగింపు సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు బహుమ తులు అందించ నున్న ట్లు ఆమె తెలిపారు. గ్రంథాలయ పాఠకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : గ్రామాల అభివృద్ధికి అది ,కారులు ప్రజాప్రతినిధులు సమిష్టి గా కలిసి కృషి చేయాలని దేవర పల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లి మండల పరి షత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన ఆదివారం జరిగింది . ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ గ్రామాల్లో అత్యవసర పనులు ఉంటే ప్రజా ప్రతినిధులు అధికారులు సమిష్టిగా కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి అన్నారు. ఎమ్మెల్సీ కోడ్ ఉండడంతో సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొర్లపాటి అరుణ, సాది సుబ్బారావు, మండల పరిషత్ సూపరిడెంట్ శాంతి, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ల వంటా వార్పు

గిట్టుబాటు ధర పెంచాలని రెండో రోజు నిరసన

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని వంగలపూడి ఇసుక ర్యాంపులో రెండు ర్యాంపులు ఒకదాని ద్వారా ఉచిత ఇసుక విధా నంలో భాగంగా లారీలకు అనుమతుని ఇచ్చిన సంగతి అందరికి తెలిసిందే. అయితే ఈ విధానంలో భాగంగా నదీ నుండి డంపింగ్ యార్డుకు ఇసుక తర లించేందుకు ఒకే ట్రిప్‌కు ట్రాక్టర్‌కు బిడ్ వేసిన గుత్తేదారుడు రూ.150 చెల్లి స్తున్నారు. అయితే ఆ ధర మాకు గిట్టు బాటు కావడం లేదని ట్రాక్టర్ డ్రైవర్లు, యజమా నులు వంటావార్పుతో తమ నిరసనను తెలియజే శారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ యజమానులు మాట్లాడుతూ ఇసుక ర్యాంపు మొదలు పెట్టేముందు గిట్టు బాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చి ర్యాంపు ప్రారంభించారు అని, కానీ నేటికీ మాకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే ఆదివారం ర్యాం పులో ట్రాక్టర్ డ్రైవర్లు యజమానులు వంట వార్పు చేసి తమ నిర సనను తెలియజేశారు. గిట్టు బాటు ధర కల్పించే వరకూ ర్యాంపు జరిపేదే లేదు అని ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకొని వెళ్ళతామని అన్నారు. దీనితో గత రెండు రోజు లుగా నిలిచిన ఇసుక ర్యాంపు. అలాగే రెండవ ఇసు క ర్యాంపులో రెవెన్యూ అధికారులు రోజుకో నిబంధన పెడుతూ ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తున్నారు అని వాపోతున్నారు.

ఐక్యతకు ప్రతీక వన సమారాధనలు

విశాలాంధ్ర - రాజమహేంద్ర వరం రూరల్ : ఆత్మీయత, ఐక్యత కు ప్రతీక కార్తీక వన సమారా ధనలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు మరియు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొ న్నారు. ఆదివారం కోరుకొండ మండలం బూరుగుపూడి గేటు సమీపంలో రత్న ప్లాస్టిక్ వారి తోటలో శ్రీలక్ష్మి నరసింహ గాయత్రి బ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో జరిగే కార్తీక వన సమారాధనలో అదే గ్రామంలో సుంకర సత్యనారాయణ గారి కొబ్బరి తోటలో శ్రీ శ్రీ శివ సాయి కాపు సం క్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో జరిగే కార్తీక వన సమారాధన మహోత్సవ కార్యక్రమంలో జక్కంపూడి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయులందరు ఒకచోట చేరడం వలన బంధులు, బాంధ వ్యాలు బలపడతాయన్నారు. వివిధ కులస్థులను సంఘటితం చేసే సంకల్పం తో నేడు సమారాధనలు జరుగుతున్నాయని, తమ కులంలో ఆర్థికంగా వెనుక బడిన వారికి చేయూత నిచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తు తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు.. ఎవరికి ఏ అవసరం ఉన్నా తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

వన సమారాదనలు సమాజ సమైక్యతకు దోహదం

విశాలాంధ్ర - రాజ మహేంద్రవరం : సమాజ సమైక్యతకు దోహదం చేసే కార్తీక సమారాధనలు ప్రతీ చోటా నిర్వహించటం అభి నందనీయమని రాజమహేం ద్రవరం పార్లమెంటు సభ్యు రాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం ఆనాల వెంకట అప్పారావు రోడ్డులో గణపతి ఆలయం ఎదురుగా ఉన్న మామిడి తోట లో జిల్లా భట్రాజు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన వివిధ కులాల కార్పొరేషన్ లో భట్రాజు కులస్తులకు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రజా సేవ చేసుకునే అవకాశం కల్పించాలని జిల్లా సంఘ అధ్యక్షుడు లోలభట్టు శ్రీనివాసరాజు కోరారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా కార్తీక వన సమారాధన, అనేక సంక్షేమ సమాజ సేవా కార్యక్రమాలు చేస్తున్న సంఘ అధ్యక్షుడు, సేవారత్న లోలభట్టు శ్రీనివాసరాజు, సంఘ సభ్యుల కృషిని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. ఈ ఈ కార్యక్రమం లో బిజెపి నాయకులు దత్తు, హైకోర్టు రిజిస్ట్రార్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి వెంకట నరసింహరాజు, పోలవరం తహసిల్దార్ భీమ భట్టు సాయిరాజు, జీఎస్టి ఆఫీస్ విశ్రాంత అధికారి కోకిలవాణి కృష్ణంరాజు, సంఘ కార్యదర్శులు భగీరరాజు, చిటపనేని వెంకటరాజు, చల్లగాలి వెంకట్రాజు, కార్యభట్టు శ్రీకృష్ణ రవీంద్ర రాజు, పరమహంసరాజు, రఘురాం దీక్షిత్ రాజు పాల్గొన్నారు.

దూర విద్యా కేంద్రంను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - అనపర్తి : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వారి దూర విద్యా కేంద్రం గతంలో స్థానిక జిబిఆర్ డిగ్రీ కళాశాలకు ఆర్ట్స్ గ్రూప్తో డిగ్రీ, పీజీ కోర్సులు మంజూరు చేసినట్లు కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు) తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుండి పీజీ కోర్సుల్లో సైన్స్ గ్రూపులైన ఎంస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, మైక్రో బయాలజీ, బోటనీ, జువాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రినల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్ గ్రూపులు మంజూరైనట్లు కరస్పాండెంట్ కొండ బాబు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు, ఉద్యోగులు, గృహిణులు, కళాశాలకు వెళ్లలేని విద్యార్థులు కోర్సులను వినియోగించుకోవచ్చు అన్నారు. ఈ దూర విద్యా కేంద్రం ద్వారా తమ విద్యార్హతలను మెరుగు పరుచుకోవచ్చని కొండబాబు తెలిపారు. సైన్స్ గ్రూపులు మంజూరుపై డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎన్ పి అబ్బాయి రెడ్డి, పి ఆర్ ఎల్ స్వామి, పాలక సభ్యులు గొలుగూరి రామారెడ్డి, డైరెక్టర్లు బి రత్నారెడ్డి,డివి ఆర్‌పి పాపిరెడ్డి, కె హరినాథ రెడ్డి, గొలుగూరి జగన్నాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

మేధో సంపత్తికి గ్రంథాలయాల ఆవశ్యం

విశాలాంధ్ర - కడియం : కడియం శాఖ గ్రంథాల యం 57వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాలలో భాగం గా ఆదివారం సీనియర్ గ్రం థాలయ సభ్యులు యాగన రాజేశ్వరావు విచ్చేసి సరస్వతి దేవికి జ్యోతి ప్రజ్వలన చేశారు. గ్రంథాలయం ఆధునిక దేవాలయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సభ్యులు బొర్రా రామకృష్ణ విద్యా ర్థులకు మెటీరియల్ ఇచ్చి చిత్రలేఖనం పోటీలు ప్రారంభించారు. రేపటి వక్తృ త్వ పోటీలకు కూడా అధిక సంఖ్యలో పాల్గొనాలని విద్యార్థులకు శ్రీదేవి నిర్మల సూచనలు చేశారు. ఈకార్యక్రమం లో భాస్కర్ రావు చిలుకూరు వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరకట్న నిషేధంపై విద్యార్థుల గళం

విశాలాంధ్ర - గోపాలపురం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో వకృత పోటీలను గ్రంథ పాలకుడు విజ్జు సత్యనారా యణ నిర్వహించారు. ఈ డిబేట్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, స్థానిక శర్వాణి హై స్కూల్, , వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 40 మంది విద్యార్థులు ఈ డిబేట్లో పాల్గొని వరకట్న నిషేధం అనే అంశంపై తమ గళాన్ని వినిపించారు. కట్నం తీసుకునే వాళ్ళు, కట్నం ఇచ్చేవారు నేరానికి పాల్పడినట్లేనని విద్యార్థులు తమ మనోభావాలను వ్యక్తం చేశారు. యువత వరకట్న నిషేధంపై గ్రామస్థాయి నుంచి తమ గళం విని పించాలని ఆకాంక్షించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్ర మంలో ఆయా పాఠశాలల ఉపాధ్య యులు, న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు.

22న అరిగేల బలరాం మూర్తి సాహిత్య కళాపీఠం వార్షికోత్సవం

విశాలాంధ్ర - అమలాపురం : అంబాజీపేటలో ఈనెల 22వ తేదీన జరిగే అరిగెల బలరామ మూర్తి సాహిత్య కళా పీఠం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా వెలువరించిన ఆహ్వాన పత్రిక, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కవితా పోటీలు జరిగాయి. 22వ తేదీ జరిగే సాహిత్య కళా పీఠం వేదికపై ఒక కవికి, ఒక ప్రముఖ కళాకారునికి, ఒక సామాజికసేవా కార్యకర్తకి సన్మానం జరుగుతుంది, అమలాపురం శాఖా గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో అరిగెల బలరామమూర్తి, బివివి సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి చెప్పారు.

అపార్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి : ఎంపీడీఓ

విశాలాంధ్ర - జగ్గంపేట : విద్యార్థుల ఆపార్ జనరేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని జగ్గంపేట ఇంచార్జి ఎంపిడిఓ వివిఎస్ చంద్రశేఖర్ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ పుట్టినతేదీ, ఆధార్, స్టడీ రిజిస్టర్‌లలో ఒకే తేదీ ఉండేలా ఉండాలన్నారు. ఎమ్ఈఓ స్వామి మాట్లాడుతూ ఆధార్, పుట్టిన తేదీలు కరెక్ట్‌గా ఉంటే స్టడీ రిజిస్టర్‌లో మార్పే అవకాశం వచ్చిందన్నారు. తహసీల్దార్ జివిఆర్ రమేష్ మాట్లాడుతూ పుట్టిన తేది మార్పు ఉంటే ఆధార్, స్టడీ రిజిస్టర్ ప్రకారం మేము డేట్ ఆఫ్ బర్త్ మార్పుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఈఓ 2, జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివిఎస్ రంగారావు, మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేట్ కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవముల 4వ రోజైన ఆదివారం పాఠశాల విద్యార్థులకు సీనియర్ విభాగంలో డ్రగ్స్ రహిత సమాజంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి డి శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో 50 మంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు 20వ తేదీ బుధవారం గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభ సందర్భంగా ప్రశంసా పత్రములు, బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందం, ఆరోగ్యం

విశాలాంధ్ర - అనపర్తి, పెదపూడి : కార్తీక మాసంలో వన భోజనాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆనందం,ఆరోగ్య సందేశాన్ని కార్తీక వనభోజనాలు చాటి చెపుతాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం గొల్లల మామిడాడ ఫ్యామిలీ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పేపకాయల వెంకటలక్ష్మి వెంకటరమణ, ఎంపీపీ కేతా తులసి శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షులు ద్వారంపూడి వెంకటరెడ్డి (చింతపండు), వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మ, మండ రాజారెడ్డి, సబ్బెళ్ళ భీము, ద్వారంపూడి జగదీశ్వర్ రెడ్డి, ద్వారంపూడి బ్రహ్మానంద రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర - కరప : భూమి ఆరోగ్యాన్ని కాపాడడం ప్రకృతి వ్యవసాయం తోనే సాధ్యమవుతుందని ఏపీ సీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ ఇలియాజర్ పేర్కొన్నారు. కరప మండలం, యండమూరు, జడ్ భావరం, కొంగోడు, యూనిట్ల లో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సామర్లకోట టిటిడిసి సెంటర్ నందు శిక్షణ ఇచ్చామని అన్నారు. ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలైన సార్వత్రిక సూత్రాలు, ఆర్డీఎస్ కిట్స్ తయారీ విధానం, పిఎండిఎస్ కిట్స్ తయారీ విధానం పలు పంటల విధానం, ఏ గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్, డిజిటల్ స్కిల్స్, మార్కెటింగ్ విధానం వంటి అంశాలపై శిక్షణ అందించామని ఆయన పేర్కొన్నారు. రసాయనకి ఎరువులు వాడకం ద్వారా భూమి ఆరోగ్యం పూర్తిగా చెడిపోయి రాబోవు భవిష్యత్తు తరాలకు ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని డిపిఎం సూచించారు. ప్రస్తుతం రసాయనాలతో పండించిన పంటల వలన ప్రజల ఆరోగ్యాలు ముప్పు వాటిల్లుతుందని ఈ ప్రమాదాన్ని అధిగమించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించవలసి ఉందని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమాలలో ఎన్ఎఫ్ఎంటిలు, ఎంటిలు, క్యాడర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిర్ర యానాంలో పీతల హేచరీ

మత్స్య శాఖ కమిషనర్ డోలా శంకర్

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన మండల పరిధిలో చిర్ర యానాం గ్రామంలో పసుపు పీతల యాచరికి కేటాయించిన ఐదు ఎకరాల భూములను శనివారం మత్స్య శాఖ కమిషనర్ డోలా శంకర్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పీతల సాగు ఆక్వారైతులతో స్థానికంగా పసుపు పీతల సాగుకు అనువైన పరిస్థితులు గుర్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమిళనాడు యాచరీ నుండి ఒక్కొక్క పీతను 12 రూపాయలు కొనుగోలు చేసి మూడు రూపాయలు రవాణా చార్జీలు చెల్లిస్తున్నప్పటికీ సుమారు 1300 కిలోమీటర్లు ప్రయాణం మూలంగా పసుపు పీతల పిల్లలు 50 శాతం చనిపోతున్నాయని కావున స్థానికంగా పసుపు పీతల పిల్లలను ఉత్పత్తి చేస్తే తమ పీతల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటుందని వారి పేర్కొన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసే యాచరి ద్వారా పీత పిల్లలను అందించినట్లయితే నూటికి నూరు శాతం బ్రతికేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అదేవిధంగా మూడు రూపాయలు ప్రయాణంచార్జి ఆదనంఅవుతుందని వారు కమిషనర్‌కు వివరించారు. రాష్ట్రంలో ఇది మొట్టమొదటి ప్రాజెక్టుగా నిలుస్తుందని పీతల సాగు రైతులకు ఎంతో లబ్ధిని చేకూరుస్తుందనడంలో అతిశయోక్తి లేదన్నారు. జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రత్యేకత చొరవ తీసుకొని కేవలం 15 రోజులలో ఐదు ఎకరాల భూమిని యాచరికి కేటాయించడం ఆనంద దాయకమన్నారు. సుమారు రెండు కోట్ల 75 లక్షల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించడం సంతోషదాయకమన్నారు. కమిషనర్ డోలా శంకర్ మాట్లాడుతూ యాచరీ నెలకొల్పడానికి అనువైన పరిస్థితులు స్థానికంగా ఉన్నాయని కేవలం అందరి సమన్వయంతో నాలుగు మాసాలలో యాచరీని నెలకొల్పడం జరుగుతుందని పీతల సాగు రైతులకు వివరించారు. గ్రామ పెద్ద ఎన్ నాగేశ్వరరావు ఈ ప్రాంతంలో పీతల సాగు గుర్చి కమిషనర్ వారికి కూలంకషంగా విశదీకరించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ నేషన్స్ అభివృద్ధి ప్రోగ్రాం ప్రతినిధి సుదీప్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎల్వీఎస్ వర్ధన్, ఎఫ్డిఓ గోపాలకృష్ణ, గ్రామ మత్స్యశాఖ సహాయకులు లోవరాజు, బాలయోగి, మీనా కుమారి, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో ఏదైనా సాధించుకోవచ్చు : ఎమ్మెల్యే జ్యోతుల

విశాలాంధ్ర - జగ్గంపేట : కాపులు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చని ఆ దిశగా ప్రయత్నం చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టు క్రింద భోజనం చేస్తే మంచిదని పూర్వీకుల నుండి నమ్మకం. దానిలో భాగంగా జగ్గంపేట కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాపు కళ్యాణ మండపం వద్ద వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూతో పాటు, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్, కుడా ఛైర్మెన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎంపి వంగా గీత, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, సిఎం ప్రోగ్రాం కమిటీ కన్వీనర్ పేరాబత్తుల రాజశేఖర్, కాపు సద్భావన సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాసు, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం. నియోజకవర్గాల జనసేన పార్టీల ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, వరుపుల తమ్మయ్య బాబు, పాల్గొని కాసేపు ఉల్లాసంగా గడిపారు. కాపు సంక్షేమ సంఘం నేతల్ని సన్మానించింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీ గీత మాట్లాడుతూ టిటిడి బోర్డు మెంబర్‌గా ఎన్నికైన నెహ్రూను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు ఆకుల రామకృష్ణ, మారిశెట్టి భద్రం, దవులూరి ఈ శ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోతుకుర్రు సత్తిబాబుకు సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సీనియర్ తెలుగుదేశం నాయకుడు సయ్యపరాజు వెంకట సత్యనారాయణ. రాజు (పోతుకుర్రు సత్తిబాబు) నియమితులు కావటం పట్ల ఆయన స్వగ్రామం అయినవిల్లి మండలం పోతుకు ర్రులో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. మండల టిడిపి అధికార ప్రతినిధి మెల్లం సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గుమ్మళ్ల సాగర్ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్కా రామకృష్ణ, మద్దెల రామకృష్ణ, సాగిరాజు సూరిబాబురాజు, పైబోడి వెంకటేశ్వరరావు, దొంగ శ్రీను, పాటి నాగేశ్వరావు, చింతపల్లి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగ ఫలితమే గ్రంధాలయాలు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములు సందర్భముగా మలిరెడ్డి సరస్వతీ శాఖా గ్రంథాలయము గొల్లప్రోలులో ఆదివారం "రచయితల సందేశాలు, చర్చలు, కవి సమ్మేళనాలు."కార్యక్రమం నిర్వహించారు. గ్రంథమనగా కూర్పు, కవులు లేదా రచయితల భావాలను కూర్చిన పుస్తకాన్ని గ్రంథమని, గ్రంథాలకు నిలయమైనది కాబట్టి గ్రంధాలయం. విజ్ఞానాన్ని పెంపొందించు కోవడానికి, ఆలోచనా పరిధిని విస్తృతం చేసుకోవడానికి ఉన్నత వ్యక్తిత్వాన్ని సంపాదించు కోవడానికి అత్యున్నతమైనది పుస్తక పఠనం. విద్యార్థులను సృజనాత్మకంగా, గుణాత్మకంగా తీర్చిదిద్ది వారిలో విజ్ఞాన తృష్ణ తీర్చేవి గ్రంథాలయాలు అని రచయిత బొజ్జా ప్రసాద్ పేర్కొన్నారు. అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల, గిడుగు, పాతూరి వంటి మహనీయులు ఉద్యమాలు త్యాగాల ఫలితమే గ్రంథాలయాలు అని, గొల్లప్రోలుకు శాఖా గ్రంథాలయం తీసుకు రావడంలో డాక్టర్ మలిరెడ్డి వెంకట్రాజు కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డా ఎమ్‌విఆర్ మెమోరియల్ హెల్త్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సభ్యులు కుర్ర నారాయణరావు, స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, విశ్రాంత ఉపాధ్యాయులు త్రిమూర్తులు, విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయులు కొండలరావు, నారాయణరావు పాల్గొన్నారు.

శానిటేషన్ పై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర - రాజోలు : గ్రామాలలో శానిటేషన్ పై గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, అధికారులు దృష్టి పెట్టాలని రాజోలు ఎమ్మెల్యే దేవ రాజేంద్రప్రసాద్ సూచించారు. రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ కేత శ్రీనివాస్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సమావేశంలో కడలి గ్రామ సర్పంచ్ చొప్పల గుణనాధ్ విద్యుత్ సమస్యల పై విద్యుత్ శాఖ అధికారులను నిలదీశారు. అలాగే తాటిపాక సర్పంచ్ రత్నమాల ఆర్ డబ్ల్యూఎస్ అధికారుల తీరు బాగోలేదు అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి గ్రామంలో తాగునీరు సరఫరా కావడం లేదని సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్షణమే గ్రామాలలో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ సరఫరా అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజా ప్రతినిధులతో గ్రామాలలో సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించాలని అయా శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పిటీసీ మట్టా శైలజ, వైస్ ఎంపీపీలు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీడీఓ రాంబాబు, తహశీల్దారు ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసిలు, అధికారులు పాల్గొన్నారు.

మూలేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని మూలస్థానంలో వేంచేసి ఉన్న ఉమామూలేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి కొత్తపేట ఎమ్మెల్యే బం డారు సత్యానందరావు ఆదివారం హాజరయ్యారు. ఎమ్మెల్యేకు ఆలయ ఈవో శివ రామకృష్ణ ఆధ్వర్యంలో అర్చక స్వాములు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చిన్న, సుబ్బారావు, లాలం శ్రీను, సత్తిపండు,శ్రీను, ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరుబండి వారి ఆత్మీయ కలయిక ఆదర్శం

ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర – ఆల మూరు : ప్రతి ఏటా జరిగే ఎరుబండి వారి ఆత్మీయ కలయిక పలువురికి ఆదర్శంగా నిలుస్తుందని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బడుగువానిలంకలో ఎరుబండి ధర్మరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీ య కలయిక కార్యక్రమంలో వారు ఆదివారం ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా వారికి ఘన స్వాగతం పలికి ఇండోర్ ప్లాంట్ బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచం మొత్తం మీద వివిధ ప్రదేశాల్లో నివాసాలు ఉంటున్న ఎరుబండి కుటుంబీకులు ఈ కార్తీక మాసంలో వన సమారాధనతో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం జరిగిన పలు సంస్కృతిక కార్యక్ర మాలు చూపకులను అలరించాయి. కూటమి నాయకులు రామానుజుల శేషగిరిరావు, పాలూరి గోవింద రాజు, దూలం రాంబాబు, పడాల అమ్మిరాజు నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు లిటిల్ సోల్జర్స్ విద్యార్థులు

విశాలాంధ్ర - పిఠాపురం: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన పిఠాపురం బాక్సర్స్ ఈనెల 16వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తాటిపాకలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ అండర్ 17 బాల బాలికల విభాగంలో పిఠాపురం లిటిల్ సోల్జర్స్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న బి నాగ రుతిక 46 కేజీల భాగంలో. పిఠాపురం భాష్యం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న జెఆర్ అరుణ్ 70 కేజీల విభాగంలో ఎంపిక య్యారు. వీరిద్దరూ ఈ నెల 19వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉమ్మడి కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జరుగుతున్న 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొంటారని కోచ్ పి లక్ష్మణరావు తెలిపారు. ఎంపికైన బాక్సర్స్‌ను డిస్ట్రిక్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి శ్రీనివాస్ కుమార్, కాకినాడ జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎల్ జార్జ్‌లు బాక్సర్స్‌ని అభినందించారు.

నిరుపేద కుటుంబాలకు ఆసరా

విశాలాంధ్ర – కరప : మండలంలోని వేలంగి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు పదివేల రూపాయల విలువ చేసే రేషన్, నిత్యవసర సరుకులు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ మండల విద్యాశాఖ అధికారి అందజేశారని ఆసరా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు అలీం తెలిపారు. ఈ కార్యక్రమంలో సునంద, సుబ్రహ్మణ్యం, ఇమ్రాన్, దుర్గాదేవి, ప్రశాంత్, సుధాని పాల్గొన్నారు.

నూతన బీజేపీ బూత్ కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర - రౌతులపూడి : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులురాలు దగ్గుపాటి పురందేశ్వరి. కాకినాడ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు ఊటా శ్రీను ఆధ్వర్యంలో మండలం నూతన బూత్ కమిటీల ఏర్పాటు గురించి సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో 20 మంది కార్యకర్తలు, మండల ప్రధాన కార్య దర్శి రాజా, యాదగిరి వెంకటరమణ, మండల ఉపాధ్యక్షులు మల్లయ్య నాయు డు, శీను, వెంకటరమణ, కన్నబాబు, వీరబాబు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా స్వామ్యబద్ధంగా అసెంబ్లీ సమావేశాలు

టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కేతా శ్రీనివాస్

విశాలాంధ్ర – ఆలమూరు : భారత ప్రజాస్వామ్యానికి బద్దులుగా అసెంబ్లీ సమావేశాలు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరు ఆదర్శమని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిన తీరు ఒక మాయని మచ్చగా ప్రజల గుండెల్లో నిలిచి పోయిందని రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కేతా శ్రీనివాస్, టిడిపి నియోజక వర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కాసా విజయకుమార్, తెలుగుదేశం మండల బీసీ సెల్ అధ్యక్షులు చెల్లబోయిన సింహాచలం పేర్కొన్నారు. మండల కేంద్రం ఆలమూరులో ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమ ర్శలు సహజ మేన్నారు. అయితే విన దానికి అస భ్యకరంగా ఉండే పదజా లంతో కుటుంబ సభ్యులపై దాడి చేయడం వంటి తప్పుడు విధానాన్ని వైసి పి పార్టీ నుంచే మొదలైందని వారు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణిపై అసెంబ్లీ సాక్షిగా నాటి మంత్రులు నీచాతి నీచమైన వ్యాఖ్యలు చేసిన ప్పుడు జగన్మోహన్ రెడ్డి ముసిముసి నవ్వులు నవ్వు కుంటూ ఆ వ్యాఖ్యల్ని ఆనందించిన దృశ్యాలు ఇం కా రాష్ట్ర ప్రజల మదిలోంచి తొలగిపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో తప్పుడు వ్యాఖ్యలు చేసిన వర్రా రవీంద్ర రెడ్డి అరెస్టుతో జగన్ వెన్నులో వణుకు మొదలైందని వారు వ్యాఖ్యానించారు. జగన్ సమక్షంలో ఎదుటివారి వ్యక్తిగత విష యాలపై చర్చకు వచ్చినప్పుడు అసెంబ్లీ వేదికగా వాటిని ఖండించకపోవడం రాజకీయాలకే మచ్చగా మిగిలి పోయిందన్నారు. గత వారంలో జరిగిన అసెంబ్లీ సమావేశాలను చూసిన వారికి, గత ప్రభుత్వ అసెంబ్లీ సమావేశాలకి, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలకు వ్యత్యాసం కనబడు తుందన్నారు. అప్పుడు జగన్ హయాంలో కౌరవ సభగా ఉన్న సభను, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు గౌరవ సభగా ఎలా మార్చారో అర్థమవుతుం దన్నారు. ప్రజా కోర్టులో మొట్టికాయలు తిన్న తర్వాత కూడా జగన్‌కి జ్ఞానో దయం కాలేదని వారు విమర్శించారు. ఇకనైనా బాధ్యత కలిగిన రాజకీయ నాయ కునిగా ఒక ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై జగన్ స్పందించ కపోతే వచ్చేసారి ఆ 11 సీట్లు కూడా రావని వారు హెచ్చరించడం గమనార్హం.

విశ్వజన కళామండలి అత్యవసర సమావేశం

విశాలాంధ్ర – అమలాపురం : అమలాపురం స్థానిక ఎర్ర వంతెన వద్ద షైనీ ఒకేషనల్ జూని యర్ కాలేజీలో జాతీయ అధ్య క్షులు డాక్టర్ మాస్టర్జీ అధ్యక్షతన విశ్వజన కళా మండలి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వడ్డీ ఏడుకొండలు, ఉపాధ్యక్షులు ఎడ్ల సురేష్ కుమార్, కేంద్ర సాంస్కృతిక అధ్యక్షులు మేకల మీరా సాహెబ్, జిల్లా అధ్యక్షులు గద్దం శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలు గాయని పల్లేటి సుశీల పాల్గొని సంస్థ 46వ వార్షికోత్సవము డిసెంబర్ 10వ తేదీన గానీ వారం రోజులు అటు ఇటు గాని జరుగుతుందని తీర్మానించారు. ఈ కార్యక్రమానికి భూసం వైవి సత్యనారాయణ, బర్రె కొండబాబు, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రంలో వివిధ రాజకీయ నాయకులు, మేధావులు, గాయకులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర – సామర్లకోట : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములు 4వ రోజు ఆదివారం తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సీని యర్స్ విభాగంలో పర్యావరణం పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పెద్దబ్రహ్మ దేవంశాఖ గ్రంథాలయ అధికారి మణికుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు 20వ తేదీన ప్రశంసా పత్రములు, బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఒత్తిడి లేని ఆరోగ్యకర జీవితాన్ని గడపుదాం

విశాలాంధ్ర – అమలాపురం : 25 సంవత్సరాల క్రితం వరకు, ఒత్తిడి (స్ట్రెస్) అనేది కేవలం ఒక సైన్సు పదమే. మన మానసిక స్థితిని నిర్వచించే పదంగా అప్పుడు ఆ పదం లేనేలేదు. ఆ రోజుల్లో కూడా, మనం ఇప్పటిలా చాలా కష్టపడ్డాం. ఈరోజుల్లో ఉన్నట్లుగానే ఆ రోజుల్లో కూడా పరిస్థితులు సవాలు విసిరేవిగా ఉన్నాయి. అయినా గానీ నాకు ఒత్తిడి కలుగుతుంది అని ఆనాడు అనలేదు. నెమ్మదిగా, ఒత్తిడి అనే పదాన్ని మనం ఒక మనోభావనగా, మన మానసిక స్థితిగా వర్ణిస్తూ వచ్చాము. నేను చాలా కష్టపడి పని చేస్తున్నాను, రెగ్యులర్‌గా చేసే పనులకన్నా ఎక్కువగా పని చేస్తున్నాను అని చెప్పడానికి 'నాకు స్ట్రెస్ ఉంది' అన్న మాటను ఉపయోగిస్తున్నాము. ఒత్తిడి గురించి మనకున్న అవగాహనను ముందు అర్థం చేసుకుందాం. నిజానికి మనం సంతోషం, శాంతి, శక్తి నిండిన ఆత్మలం. మనం చేసే అపసవ్య ఆలోచనల పరిణామమే ఒత్తిడి. అది ఒక భావోద్వేగ నొప్పి, మనం మారాలి అన్న సంకేతాన్ని ఆ బాధ మనకు చెప్తుంది. కానీ మన చుట్టూ ఉన్నవారు కూడా ఒత్తిడిలో ఉండటాన్ని చూసి, ఒత్తిడి ఈరోజుల్లో అందరికీ ఉంటుంది, సహజమే, ఉన్నా ఫర్వాలేదు అనుకుంటున్నాము. ఇది నిజం కాదు. ఒత్తిడి మన శారీరక మరియు భావోద్వేగ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అది మన సమర్థతను, జ్ఞాపక శక్తిని, నిర్ణయ శక్తిని ప్రభావితం చేసి మన పనితీరును తగ్గిస్తుంది. కనుక, ఎలాంటి ఒత్తిడి అయినా అది హానికరమే.ఇలాంటి ఒత్తిడిని జయించాలంటే నిరంతరం యోగాభ్యాసం చేయాలని సూచించారు రాజయోగిని బికే రమాదేవి. జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకొని అమలాపురం బ్రహ్మా కుమారీస్ హార్మోని హౌస్‌లో సెంటర్ ఇంచార్జి బికె శ్రీదేవి నేతృత్వంలో అమలాపురంలోని పాత్రికేయులకి విధి నిర్వహణలో ఒత్తిడిని జయించే యోగాభ్యాసం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైజాగ్ నుండి విచ్చేసిన రాజయోగిని రమాదేవి ముఖ్య అతిథిగా విచ్చేసి పాత్రికేయులకి అవగాహన కల్పించారు. కార్తీక మాసం సందర్భంగా అందరికి వన భోజనాలు ఏర్పాటు చేసారు. అనంతరం పాత్రికేయులకి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బికె శ్రీదేవితో పాటు, బికె స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా వంతెనల నిర్మాణం

- పట్టించుకున్న నాధుడే లేడు
- శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి

విశాలాంధ్ర - అనపర్తి, పెదపూడి : అనపర్తి నియోజకవర్గంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇరిగేషన్ కాలువలపై వంతెనల నిర్మాణాలు చేపట్టి 70 శాతం పనులు పూర్తిచేసి, 30 శాతం పనులు వదిలి వేశారని, నాటినుండి నేటి వరకు ఆ వంతెనలను పట్టించుకున్న నాధుడే లేడని శాసన సభ సమావేశాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకి వివరించారు. సంబంధిత మంత్రి ఇరిగేషన్ కాలువలపై అసంపూర్తిగా నిర్మాణమైన వంతెనలను పూర్తి చేసే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గానికి సుమారు నాలుగు కోట్లు కేటాయిస్తే బిక్కవోలు మండలం కొంకుదురు, కొమరపాలెం గ్రామాల మధ్య అసంపూర్తిగా ఇరిగేషన్ కాలువలపై నిలిచిపోయిన వంతెనలను పూర్తి చేయవచ్చన్నారు. నిలిచిపోయిన వంతెనలను పూర్తి చేసి ప్రజలకు మేలు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్లకు మరమ్మతులు

విశాలాంధ్ర - సామర్లకోట : పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప చొరవతో సామర్లకోట కెనాల్ రోడ్డులో గోతులకు మరమ్మత్తు పనులను శనివారం చేపట్టారు. స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రక్కన గల మాండవ్య నారాయణ స్వామి ఆలయం వంతెన వద్ద నుంచి షుగర్ ఫ్యాక్టరీ వద్ద వరకు కెనాల్ రోడ్డుకు విపరీతంగా గోతులు పడి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే చిన రాజప్ప రహదారి మరమ్మతులకు ముహూర్తం చేసిన విషయం తెలిసిందే. దానిలో భాగంగా ఓవర్ బ్రిడ్జి ప్రక్క కెనాల్ రోడ్డు గోతులను పూడుస్తూ తారు రోడ్డును నిర్మించి ప్రయాణీకుల ఇబ్బందులను పరిష్కరించారు. ఈ చర్యలతో పలువురు రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాలు ఆర్థిక సమృద్ధి సాధించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కాకినాడ : మండలంలోని ఎన్నికలు జరగని ఆరు గ్రామపంచాయతీలు అభివృద్ధికి నిధులు లేక కనీసం పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితి నెలకొనడంతో ఈ విషయాన్ని శాసనసభలో ప్రస్తావించినట్టు గ్రామీణ శాసన సభ్యులు పంతం నానాజీ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, వార్డు మాజీ సభ్యులు కేపీవీ బాలాజీ తదితరులు ఎమ్మెల్యే నానాజీని కృతజ్ఞతగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణయ్యపేట, వాకలపూడి, వలస పాకల, ఇంద్రపాలెం, చీడిగ, తూరంగి గ్రామాలకు 13 సంవత్సరాలుగా ఎన్నికలు జరగకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని అన్నారు. కోర్టు వివాదాలే కారణం కాబట్టి న్యాయస్థానంలో వ్యాజ్యం వేసిన కక్షిదారులు ఆయా కేసులను ఉపసంహరించుకుంటే ఎన్నికలు జరిగి ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయని అన్నారు. ఈ విషయమై ద్వంద్వ వైఖరి ఏమీ లేదని హైకోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవించి పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుందని అన్నారు. మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ మేజర్ పంచాయతీలైన ఈ ఆరు గ్రామపంచాయతీలు నిధులు లేక కనీస వసతులు తీర్చలేని స్థితిలో ఉన్నాయని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టాంప్ డ్యూటీ, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఇవ్వాల్సిన నిధుల విషయమై శాసనసభలో ప్రస్తావించినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యే నానాజీని సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పితాని రాము, సతీష్, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ సభ్యుల అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో బిజెపి సంఘటన పర్వ్ 2024లో భాగంగా బూత్ కమిటీ ఎన్నికల అవగాహన సదస్సు శనివారం స్థానిక బిజెపి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్నికల అధికారిగా నియమింపబడిన మట్టా మంగరాజు, సహాయ ఎన్నికల అధికారిగా కామినేని జయశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి కాకినాడ జిల్లా బిజెపి వైస్ ప్రెసిడెంట్ ఉమ్మడి వెంకట్రావు, నియోజకవర్గ బిజెపి కన్వీనర్ సింగిలిదేవి సత్తి రాజులు స్వాగతం పలికారు. వారిని సాలువాలతో సత్కరించారు. అలాగే ఈ కార్యక్రమం ఎన్నికల ఆర్వోగా వెంకటేశ్వరరావు, ఏఆర్ఓ సత్యనారాయణ, బిజెపి మండల అధ్యక్షులు కందా వీరాస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

పి మల్లవరం సర్పంచ్ మృతి

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్ళరేవు మండల టీడీపీ అధ్యక్షులు పి మల్లవరం గ్రామపంచాయతీ సర్పంచ్ దున్నా సత్యనారాయణ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. ఆయన మృతికి తెలుగుదేశం పార్టీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన పార్థివదేహానికి ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు నివాళులు అర్పించారు. వివేకానంద, గుత్తుల సాయి, దూళిపూడి బాబి, వినోద్ రాజు, అత్తిలి బాబూరావు, తాళ్లరేవు మండల కూటమి నాయకులు, మండల వైసీపీ అధ్యక్షులు గోవింద్ కుమార్, తాళ్ళరేవు మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు, సీపీఎం పార్టీ, బీఎస్పీ, ప్రజా సంఘాలు సంతాపం తెలియజేశారు.

ఆటో కార్మికులకు న్యాయం చేస్తా : మంత్రి సుభాష్

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆంధ్ర ఆటోవాలా శ్రీ దుర్గా హనుమాన్ సెంటర్ అమలాపురం ఆధ్వర్యం లో కార్తీక వన సమారాధన ఆదివారం బండారు లంక లక్కిం శెట్టి వారి తోటలో ఆటో కార్మికుల కుటుంబాలతో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విచ్చేసినారు. వారికి జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు వాసంశెట్టి సతి రాజు ఆధ్వర్యంలో చిరు సత్కారం చేసి, ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఆటో కార్మికులకు అధికారం లోకి వచ్చిన వెంటనే 15 వేల రూపాయలు వెంటనే వేస్తానని చెప్పింది, కానీ ఇప్పటివరకు జరగలేదు అందుకు మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. వెంటనే స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి, లోకేష్ దృష్టికి, పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి మీకు న్యాయం చేస్తానని మాట ఇచ్చారు. జిల్లా యూనియన్‌కి నియోజకవర్గంలో డిసెంబర్ నెల ఆఖరికి నాలుగు సెంట్లు స్థలం, ఐదు లక్షల రూపాయలు బిల్డింగ్‌కి ఇస్తానని జిల్లా యూనియన్‌గా మీరందరూ ఐక్యతగా ఉండాలని మాట ఇచ్చారు. వారికి జిల్లా ఆటో వర్కర్స్ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సమావేశానికి వెంకటేష్, బొక్కానాని, బండారు శీను, ఆనంద్, ఊటుకూరు ప్రకాష్, ఎం శ్రీను, వి చంద్రశేఖర్, డి సూర్యారావు, కే రాజు, ఆర్ కాళహస్తి, ఎం ప్రసాద్, పి వసంతరావు, కె భాస్కర్ రావు, ఆర్ శ్రీని వాసరావు దుర్గ హనుమాన్ సెంటర్ కమిటీ వర్కర్స్ ఈ కార్యచరణకు వారి సొంత ఖర్చులతో రూపొందించారు.

వైద్యం వికటించి మహిళ మృతి

ఆసుపత్రి ఎదుట బంధువులు నిరసన

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు గ్యాస్ కంపెనీ రోడ్డులో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ చైత్రలో మలికిపురం మండలం అడవిపాలెం గ్రామానికి చెందిన కందికట్ల మంగ (40) మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మలికిపురం మండలం అడవి పాలెం గ్రామానికి చెందిన కందికట్ల మంగాదేవి ఇటీవలే గల్ఫ్ నుండి స్వగ్రామం వచ్చి గర్భసంచిలో కణితి ఉన్న కారణంగా శనివారం రాజోలు చైత్ర హాస్పిటల్‌కు వచ్చింది. ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఆమెకు ఆపరేషన్ చేయడానికి ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్లారు. మత్తు ఇచ్చే సమయంలో ఆమెకు రెస్పిరేటరీ ఫెయిల్యూర్ అవ్వడంతో ఆపరేషన్ థియేటర్‌లోనే చనిపోయింది. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. గైనకాలజిస్టు డాక్టర్ అప్పారి లావణ్య, ఆమె తండ్రి డాక్టర్ సూర్యనారాయణ నిర్లక్ష్యం వల్లే మంగాదేవి చనిపోయిందని కుటుంబ సభ్యులు, బంధువులు, వివిధ దళిత సంఘాల నాయకులు ఆసుపత్రి గేటు వద్ద బైఠాయించారు. ఆమె మృతికి కారణమైన డాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, మృతిరాలు కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. గతంలో కూడా ఇలాంటి సంఘటలు ఈ ఆసుపత్రిలో జరిగాయని అనుభవం లేని వారసత్వపు వైద్యం వలనే ఇలాంటి అనార్థాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపించారు. మృతురాలి కుటుంబానికి ఆరు లక్షలు ఆర్థిక పరిహారం అందిస్తామని ఆసుపత్రి యాజమాన్యం తెలపడంతో వివాదం సర్దు మనిగింది.

విద్యార్థులకు దేశ భక్తి, జానపద గేయాల పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 17వ తేదీన 4వ రోజు ఆదివారం విద్యార్థులకు దేశ భక్తి, జానపద గేయాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన ప్రముఖ స్వీయ రచనా గాయకులు ఘంటసాల పురస్కార గ్రహీత మేడిశెట్టి శ్రీరాములు, ప్రముఖ సంగీత గాయకులు ఒ హిందీ ఉపాధ్యాయులు చీడీవీ దేవి పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా సాహితీ స్రవంతి, కాకినాడ నగర అధ్యక్షులు మార్ని జానకిరామ్ చౌదరి, ప్రముఖ పద్య కవి విశ్రాంత తహశీల్దార్ గౌరి నాయుడు, రిటైర్డ్ ఉప గ్రంథాల అధికారి సలాది సాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

పది ముంపు గ్రామాలకు చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - మామిడి కుదురు : పి గన్నవరం నియోజకవర్గంలోని పది ముంపు గ్రామాలకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు ఒక్కొక్క గ్రామానికి రూ.50 వేలు వంతున చెక్కులు అందజేశారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ చెక్కులు అందజేశారు. పెదపట్నంలంక, అప్పనపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, పెదపట్నం. పి గన్నవరం మండలంలోని నాగుల్లంక, ఎల్ గన్నవరం, మొండెపులంక, పెదపూడి, ఊడుమూడి గ్రామాలకు ఈ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, కొనుకు ప్రేమజ్యోతి, సుందరనీడి రాజేష్కుమార్, గెద్దం మంగాలక్ష్మి, గుబ్బల దుర్గ పాల్గొన్నారు.

మురికి కాలువలు పరిశీలించిన సీపీఎం నాయకులు

విశాలాంధ్ర - యానాం : యానాం కేంద్రపాలిత ప్రాంతం వెంకట్ నగర్ అనుకుని ఉన్న డ్రైనును సీపీఎం నాయ కులు దుర్గాప్రసాద్, ప్రజా సంఘ నాయకులు పరిశీలిం చారు. వెంకట్ నగర్ అనుకుని ఉన్న ప్రాంతంలో డ్రైన్ పూర్తిగా సిమెంట్ బల్లలు తీసి క్లీన్ చేయాలని బల్లలు క్రింద చెత్త, చెదారం విపరీతంగా పేరుకుపోయి మురికి నీరు వెళ్లకుండా అడ్డుకుంటుందని గ్రామస్తులు తెలియజేశారు. ఈ మధ్యకాలంలోనే మిషన్‌తో డ్రైన్ పూడిక తీశారని వెంకట నగర్ గృహాలు ఉన్న ప్రాంతంలో సిమెంట్ బల్లలుతో మూసేయడం వల్ల చెత్త తీయటానికి వీలు లేకుండా పోతుంది. బల్లలు తీసివేసి డ్రెయిన్ శుభ్రం చేయాలని సిపిఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి సిమెంట్ బల్లల కింద ఉన్న చెత్త,చెదారం తియ్యక పోవడం వలన దుర్వాసనతో విపరీతమైన దోమల భాదను గ్రామస్తులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆస్పత్రి పాలు కాకుండ అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రావు, వెంకటేశ్వరరావు ౹ శ్రీనివాస్, కే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.